# బియ్యం

"ఒసే రంగీ! బుడ్డాడిందాకట్నించీ అట్టా ఏడుత్తాంటే సూత్తా వూరుకుంటావేంటే...? అడ్డమేసుకుని కాసిని పాలియ్యకూడదూ?"

"యాడుండయ్ పాలియ్యటానికి? పొద్దుట్నించీ పీకి పీకి నా పానం తీసేత్తన్నాడు సచ్చినోడు! నా కడుపు నిండందే ఆడి కదుపెట్టా నిండుద్ది? యాణ్నించి ఊరుకొత్తయ్ పాలు? రొమ్ములు సూడు ఎట్టా ఎండిపోయినియ్యో."

"ఎండిపోక ఒకనాడు సరిగ్గా వుండేడిసినయ్యంటలే? కాత్తి బువ్వన్నా కలిపి పెట్టకపోయావా?"

"ఏమీ ఎరగనట్టు అట్టా అడుగుతావేం? బువ్వేదుంది? బువ్వొండటానికి బియ్యమేదుండయ్, నిన్నే అయిపోతే.."

"ఇయ్యాల కూలికెల్లావుగా; కూలి డబ్బు లేంజేశా?"

"మూటగట్టి దాసుకున్నా; కూలిడబ్బులు యాడుండయ్? ఆ సచ్చినోడిచ్చి సావలా, ఇయ్యాల సుక్కురోరం, ఇయ్యాల సత్తే ఇవ్వను. రేప్పొద్దున్నే వచ్చి తీసుకోమన్నాడు."

"మరెట్టా? పిల్లలకేం బెట్టా?"

"ఏం బెడతాను నా బొంద?.. ఏముందని పెట్టను? బువ్వ బువ్వ అని ఏడిసేడిసి ఉప్పుడే పడుకున్నారు. సివరికి గంజి నీళ్ళు కూడా లేవు.. ఎంకినడిగాను; లచ్చినడిగాను. ఎవరిదగ్గరా గింజల్లేవు; నువ్వు బియ్యం తెత్తావని నేను కూకుంటే, నన్నొచ్చి ఈ పెశ్నలన్నీ అడుగుతావేంటి? నువ్వెందుకు తేలా బియ్యం?"

"ఒసే.. నీ యవ్వా; నేనేడ నుంచి తేనే బియ్యం? కామందియ్యాల్సిన బత్తాలన్నీ తెచ్చుకుంటిమి. పైగా రొండుసార్లు రొండిరసలు తెచ్చుకుతింటిమి... ఇంకెక్కణ్నించి వత్తాయే బియ్యం?"

"ఏటిపొడుగూతా ఎద్దల్లే శాకిరీ సేత్తన్నావ్; ఆ ఎదవ సచ్చినోడుంకో రెండు బత్తాల గింజలెక్కువియ్యలేడే; ఆడికేం రోగమా యియ్యలేక? అయినా నీ దగ్గర సరుకులేంది ఆదుమట్టుకు ఎట్టా ఇత్తాడులే, నా మీద యిరుసుకు పడ్డమే గాని కామందు నెప్పుడైనా కచ్చితంగా అడిగితేగా? మొగతనం పెళ్ళాం ముందే గాని, ఆడిముందు ఆడదానికంటే కనాకట్టమైపోతే ఆడెందుకిత్తాడు?"

"ఒసే, నోటికొచ్చినట్టల్లా వాగావంటే నరికి పోగులెడతా నాయాల...!"

"నరుకు... నరికితే ఒక్కనాటితో పీడిరగడైపోద్ది! నన్నొక్కదాన్నే కాదు. పిల్లల్ని కూడా పీక పిసికి సంపు. గిద్దెడు బియ్యం తేలేనోడికి పెళ్ళామెందుకు? బిడ్డలెందుకు? సంపు; అందర్నీ సంపెయ్...!"

"అదీ.. మళ్లీ సోకాలు మొదలెట్టా? నీ బతుకంతా ఏడుపే గదే; సాల్లే ఇక సరిపెట్టు. ఏం చేత్తాను, సావుకారు దగ్గరికెళ్ళి బియ్యమట్టు కొత్తాలే. యాడవమాక. పొయ్యెలిగిచ్చి వుంచు. పొయ్యిలోకి పుల్లలన్నా వుండయ్యా, అయ్యా లేవా?"

"పుల్లల్లేకేం? పుల్లలుండయ్‌లే; నన్ను తగలెయ్యడానికి సరిపడా వుండయ్! బేగెల్లిరా.. మళ్లీ పిల్లల్లేత్తే ఏడుత్తారు."

★★★

కామందు బియ్యం ఇవ్వలేదు. ఈ కరువు రోజుల్లో బియ్యమెక్కడివన్నాడు. బియ్యం తింటానికి నువ్వేం జమీందారువా, మహారాజువా అన్నాడు. ఒక్క పూట కూడు లేకపోతే చావరు లెమ్మన్నాడు. మీకు కడుపు నిండా కూడుంటే యింకెవర్నీ బతకనివ్వరన్నాడు.

పాలేరు ఏమీ అనలేకపోయాడు.

పాలేరు పసికొడుకు, ఎండిపోయిన తల్లి రొమ్ములు పీకుతూనే వున్నాడు.

పిడకలూ, పుల్లలూ కూరి పాలేరు పెళ్ళాం వెలిగించిన పొయ్యి రగులుతోంది. మరి కాసేపటిలో మండుతుంది.

O

*('కథ' సెప్టెంబరు – 1971)*